ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

మంగళవారం 8 అక్టోబరు 2024 | 5



ఆర్డీవో బానో బాధ్యతల స్వీకరణ



ద్రాక్షారామ, అక్టోబరు 7 :రామచంద్రపురం ఆర్డీవోగా ఖాతీబ్ కౌసర్ బానో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండపేటలో కలెక్టర్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన ఖాతీబ్ కౌసర్ బానోను పరిపాలనాధికారి, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ముమ్మిడివరం: గోదాశివారిపాలెంలో..



రామచంద్రపురంలో వారాహి అవతారంలో సరస్వతి అమ్మవారు

మహాచండీగా దర్శనమిచ్చిన మాణిక్యాంబ

ద్రాక్షారామ, అక్టోబరు 7: దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో ఐదో రోజు ద్వాదశ శక్తి పీఠంగా పురాణ ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారు మహాచండీగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో శ్రీచక్రనవావర్ణార్చన, లక్షకుంకుమార్చన, సువర్ణ రజత పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి సుభాష్ అమ్మవారిని దర్శించుకున్నారు.



మాణిక్యాంబ అమ్మవారు

3,500 దరఖాస్తులు రావొచ్చు

రూ.70 కోట్లకు పైబడి ఆదాయం

మద్యం షాపులకు ఇతర రాష్ట్రాల వారు కూడా దరఖాస్తు చేస్తున్నారు..

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాదరావు



వివరాలు వెల్లడిస్తున్న ప్రసాదరావు

ఆలమూరు, అక్టోబరు 7: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 133 మద్యం షాపులకు గాను 3500 దరఖాస్తులు రానున్నట్లు అంచనా వేస్తున్నామని, రూ.70 కోట్లకు పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏకేవీడీ ప్రసాదరావు తెలిపారు. జిల్లాలో ఆదివారం వరకు 311 దరఖాస్తులు వచ్చాయని అయితే మిగిలిన మూడు రోజులలో అత్యధికంగా దరఖాస్తులు చేసుకోవడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం ఉండటంతో 3500 వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆలమూరు ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు పరిశీలించడానికి వచ్చిన ప్రసాదరావు స్థానిక విలేకర్లతో సోమవారం మాట్లాడారు. గతంలో జిల్లాలో 150 మద్యం షాపులు ఉండగా ప్రస్తుతం వాటిని 133కి తగ్గించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వ్యాపారస్తులతో పాటు ఇతర రాష్ట్రాల వారు మద్యం వ్యాపారంలోకి రావడానికి ఆసక్తి చూపిస్తున్నారని సమాచారం ఉందని అందువలన భారీ స్థాయిలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఉన్నట్లు ఆయన వివరించారు. మండలం, మున్సిపాలటీలు యునిట్‌గా తీసుకోవడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు ఆ పరిధిలో నాటుసారా, ఇతర మాదక ద్రవ్యాలు పూర్తిగా నిర్మూలించడానికి వీలు కలుగుతుందని దీంతో మద్యం అమ్మకాలు పెరిగే చాన్స్ ఉన్నట్లు వ్యాపారులు గుర్తించి దరఖాస్తులు ఎక్కువగా వేయనున్నట్లు ప్రసాదరావు తెలిపారు. ఆలమూరు సీఐ ఐడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 7: తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలను అందించనున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి టీవీబీ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని టాప్ స్కూల్స్, టాప్ కళాశాలలుగా గుర్తింపు పొందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాల, కళాశాలల్లో 2024-25 సంవత్సరంలో తొమ్మిదో తరగతి, పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవచ్చు. 9, 10 తరగతుల విద్యార్థులకు ఏడాదికి రూ.75వేలు చొప్పున బోధన ఫీజు, వసతి ఫీజు చెల్లిస్తారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.1.25 లక్షలు చొప్పున ఉపకార వేతనాలు అందిస్తారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉన్నవారు ఈ పథకం కింద నమోదు చేసుకోవచ్చు. ఇందు కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రసాద్ కోరారు.



7లో

రత్నగిరికి విజయ డెయిరీ నెయ్యి



మండపేటలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి అర్జీ పరిష్కరించాలి

ప్రత్యేక దృష్టితో వాటిని చూడాలి

ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయాలి

సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

మండపేట, అక్టోబరు 7: గ్రామ, మండల స్థాయిలో ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. మండపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. మొత్తం 125 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి త్వరితగతిన సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగుల వద్దకు నేరుగా కలెక్టర్ వెళ్లి అర్జీ స్వీకరించారు. దివ్యాంగు సంక్షేమ సంఘం నాయకుడు నందికోళ్ల రాజు పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కాంగ్రెస్ నాయకుడు కామన ప్రభాకరరావు మండపేట ఏడిద రోడ్డు దుస్థితిని వివరించారు. మండపేట పట్టణానికి చెందిన ముస్లింలు కలెక్టర్‌ను కలిసి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు మండపేట నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక మరమ్మతులకు ప్రభుత్వం రూ.రెండు కోట్ల నిధులు విడుదల చేసిందని వాటితో త్వరలోనే రహదారులకు మరమ్మతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ రాజబాబు, రామచంద్రపురం ఆర్డీవో ఖాతీబ్ కౌసర్ బానో, మండపేట మున్సిపల్ కమిషనర్ రంగారావు ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, డీఎల్‌డీవో శాంతి, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, తహసీల్దార్ తేజేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ దొరరాజు, పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

పింఛన్ పెంచి ఆదుకోండి



బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మామిడిశెట్టి అరుణ్‌కుమార్‌ను తల్లిదండ్రులు సోమవారం గ్రీవెన్స్‌కు తీసుకువచ్చి అర్జీ అందించారు. వైకల్యం తక్కువ ఉందని తమ బిడ్డకు రూ.15000 పింఛన్‌ను రూ.6000కు తగ్గించారని తమ బిడ్డ కదలలేడని తిరిగి పాత పింఛన్‌ను పునరుద్ధరించి రూ.15000 ఇప్పించాలని బాలుడి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

నిలువునా ముంచాడు

అప్పు వసూలు పేరుతో వంచించాడు

అప్పుకు సంబంధించిన వ్యవహారంలో నిమ్మలపూడి వీర్రాజు అనే వ్యక్తి తనను మోసం చేసి ఆర్థికంగా నష్టపరచాడని పంపన సుబ్బలక్ష్మి అనే మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. నీలా రాంబాబు అనే వ్యక్తికి తన భర్త రూ.రెండు లక్షలు అప్పు ఇవ్వగా అతను తీర్చలేదని మండపేటకు చెందిన నిమ్మలపూడి వీర్రాజు బాకీ వసూలు చేస్తానని తనను నమ్మబలికి ప్రో నోట్‌లు తీసుకుని మోసం చేసి రాంబాబు ఇంటిపై వీర్రాజు కేసు వేసుకున్నాడని చెప్పింది. అతడి వద్ద నుంచి బాకీ ఇప్పించాలని లేకుంటే ప్రో నోట్ ఇప్పించాలని కన్నీటిపర్యంతమై కలెక్టర్‌ను కలిసి వేడుకుంది. అలాగే పలువురు కాల్‌మనీ బాధితులు కలెక్టర్‌ను కలిసి వీర్రాజు అరాచకాలను విన్నవించుకుని అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన నేతలు

మండపేట మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం వచ్చిన జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ వేర్వేరుగా కలిసి పలు సమస్యలపై చర్చించారు.

155 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 7: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు జాప్యం వహించడం గానీ, నిర్లక్ష్యం చేయడం గానీ చేయరాదని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 155 అర్జీలను జేసీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, ఎస్‌డీసీ మధుసూదనరావులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీదారుల్లో విశ్వసనీయత పెంపొందించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. రెవెన్యూ, సామాజిక భద్రతా పెన్షన్లు, రేషన్‌కార్డుల మంజూరు, ఇళ్లస్థలాలు, భూసమస్యలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ వచ్చిన అర్జీలు స్వీకరించామన్నారు. అర్జీల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఉన్నతస్థాయి అధికారులు జిల్లాల వారీగా సమీక్ష నిర్వహిస్తున్నట్టు జేసీ తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే అర్జీల పరిష్కారం విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీకొరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఎస్వో ఉదయభాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన వేగుళ్ల, తోట త్రిమూర్తులు, లీలాకృష్ణ

వాడీవేడిగా..

● అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ

● పలు ప్రశ్నలను లేవనెత్తిన కౌన్సిల్ సభ్యులు

● చెరువులు, డ్రైనేజీ అంశాలపై నిలదీసిన ఎమ్మెల్సీ కుడుపూడి

అమలాపురం టౌన్, అక్టోబరు 7: అమలాపురం పురపాలక సంఘంలో చెరువుల ఆక్రమణలు.. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన విగ్రహాలు.. రక్షిత తాగునీటికి బదులు కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అంశాలపై అధికార, విపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షిత తాగునీటిని సరఫరా చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా అమలాపురంలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను తొలగించాలంటూ వచ్చిన ఉత్తర్వులపై వాడివేడిగా చర్చ జరిగింది. తొలగిస్తే పట్టణంలో ఉన్న అన్ని విగ్రహాలను తొలగించాలని ఏవో రెండు విగ్రహాలను తొలగించడం సమంజసం కాదన్నారు. కులాల మధ్య చిచ్చు రేపేలా వ్యవహరించవద్దని సభ్యులు అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ అమలాపురం పట్టణంలో పురపాలక సంఘానికి సంబంధించి ఏడు చెరువులు 31 ఎకరాల విస్తీర్ణంలో ఉండాలని ప్రస్తుతం ఎన్ని చెరువులు ఉన్నాయి. ఎంతమేర ఆక్రమణలకు గురైందో మున్సిపల్ అధికారులు గుర్తించారా అని ప్రశ్నించారు. మెయిన్‌రోడ్డులోని కంచర చెరువు ఆక్రమణలకు గురై కనుమరుగైన వ్యవహారంపై అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేశానని ఆయన గుర్తుచేశారు. పట్టణంలోని సుబ్బారాయుడు చెరువు డంపింగ్ యార్డుగా మారిపోతే మిగిలిన చెరువులు అంతకంతకు ఆక్రమణలకు గురై కుంచించుకుపోతున్న విషయం మున్సిపల్ అధికారులకు పట్టడం లేదా అని ప్రశ్నించారు. చెరువులు, మురుగుకాల్వలు, రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని తొలగించాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అవుతుందని ఫిర్యాదులు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు తిక్కా సత్యలక్ష్మి, అబ్బిరెడ్డి చంటి, మట్టపర్తి నాగేంద్ర ప్రశ్నించారు. ఇప్పటికే పట్టణ ప్రజలు మురుగనీటితో అనారోగ్యాలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షిత మంచినీటి సరఫరా కోసం లక్షలు ఖర్చు చేస్తున్నా సురక్షిత నీరు అందించకపోవడం సిగ్గుచేటని కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకురాకుండా పురపాలక సంఘం పక్కనున్న భవనం మరమ్మతులకు రూ.5 లక్షలు కేటాయించడం ఏమిటని పడాల శ్రీదేవి ప్రశ్నించారు. సభ్యులకు తెలియకుండానే కాంట్రాక్టరు పనులు ప్రారంభించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం మిగులు నిధులు రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపించిన విషయాన్ని కౌన్సిల్ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని కౌన్సిలర్ గండి దేవిహారిక ప్రశ్నించారు. మున్సిపల్ డీఈ సతీష్ మాట్లాడుతూ గత నెల 30వ తేదీన సమావేశం నిర్వహించాలనుకున్నామని, అది రద్దు అవ్వడం వల్ల చెప్పలేకపోయామన్నారు. గత మున్సిపల్ కౌన్సిలర్లకు తెలియచేయకుండా కోట్లాది రూపాయిలు బిల్లుల చెల్లింపు చేశారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరిపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ దీపాలకు ఆరు నెలల కాలానికి రూ.35 లక్షలు ఎలా కేటాయించారని కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలిగించడం లేదని మండిపడ్డారు. మార్కెట్‌లో నిల్వ మాంసం, చేపలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ బండారు గోవిందు ప్రశ్నించారు.చెత్త పన్ను రద్దు అంశంపై చర్చ నిర్వహించారు. సమావేశంలో ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, కౌన్సిలర్లు పిండి అమరావతి, సంసాని బులినాని, రుద్రరాజు నానిరాజు, గొవ్వాల రాజేష్, వాసర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ అధ్యక్షతన జరుగుతున్న సమావేశం

ధాన్యం కొనుగోళ్లకు సర్వసన్నద్ధం కావాలి

జిల్లాలో 4.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు ● జేసీ నిషాంతి



సమీక్ష నిర్వహిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణకు అధికారులు సర్వసన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కోనసీమ జిల్లాలో 4.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రస్తుత సీజన్‌లో విక్రయానికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలు, పొరపాట్లు జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలన్నారు. నవంబరు మొదటి వారంలోనే ధాన్యం సేకరణ ప్రారంభమవుతుందన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించడానికి తేమ యంత్రాలు, బరువు తూచే వేయింగ్ బ్రిడ్జిలు, కాటా యంత్రాలు సిద్ధం చేయాలన్నారు. అవసరం మేరకు గోనె సంచులు సిద్ధం చేయాలన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని టార్పాలిన్లను మిల్లుల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. తుపాన్లు వచ్చినా రైతులకు నష్టం జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తమకు నచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. గత ఐదు సీజన్లలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన సిబ్బందిని మాత్రమే ధాన్యం కొనుగోలుకు నియమించాలని స్పష్టం చేశారు. మిల్లుల తనిఖీ ప్రక్రియ తహసీల్దార్లతో నిర్వహించాలన్నారు. ఈ నెల 25లోపు రైతు సదస్సులు నిర్వహించి ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రవాణాశాఖ అధికారులు వాహనాల జాబితాను సిద్ధంచేసి జీపీఎస్ డివైజ్ ఉందో లేదో నిర్ధారించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలకు సొమ్ములు జమ చేయాలని, రవాణా చార్జీలను వారం లోపల జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్వో ఉదయభాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీసీవో మురళీకృష్ణ, తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్, జిల్లా మార్కెటింగ్ ఏడీ విశాలాక్షి, డీటీవో శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్స్ సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై అప్రమత్తం

రైతులకు పలు సూచనలు జారీ చేసిన అధికారులు, శాస్త్రవేత్తలు

ముమ్మిడివరం, అక్టోబరు 7: జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సాగులో తెగుళ్ల ముప్పేట దాడిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు వ్యవసాయ అధికారులు స్పందించారు. వ్యవసాయాధికారులు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, జిల్లా వనరుల కేంద్రం అధికారులతో కూడిన బృందాలు వరి పొలాలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు అందించినట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.బోసుబాబు తెలిపారు. పొలం పిలుస్తుంది, క్షేత్ర సందర్శన, పొలం బడి వంటి కార్యక్రమాల ద్వారా అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవసరమైన పలు సూచనలు ఇచ్చామన్నారు. వరి పంటను బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించినట్టు ఇప్పటికే శాస్త్రవేత్తలు, అధికారులు గుర్తించి రైతులకు సూచనలిచ్చారన్నారు. అధిక వర్షాలు, తెగుళ్లకు తట్టుకోలేని బీపీటీ 5204, ఎంటీయూ 1318, సంపద, స్వర్ణ వంటి వరి రకాలు రైతులు సాగు చేశారని, సిఫార్సు చేసిన దానికన్నా అధికంగా నత్రజని మోతాదుకు మించి వాడడం, పొటాష్ తక్కువగా వాడడం వల్ల ఈ తెగుళ్ల ఆశించాయన్నారు. తెగుళ్ల ఆశించిన పొలం నుంచి వరి ఆరోగ్యంగా ఉన్న మరో పొలంలోకి నీరు వెళ్లడం వల్ల కూడా ఈ తెగుళ్ల వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ తెగుళ్ల నివారణకు సరైన మందులు లేవు గనుక, తెగుళ్ల లక్షణాలపై అవగాహన ఏర్పరుచుకుని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చునన్నారు. జిల్లాలో 63.892 హెక్టార్లలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేపట్టామన్నారు. వరి పంట ఈనిక, పుష్పించే దశలో ఉన్నాయని, అయితే ఈ దశలో ఎండాకు తెగులు పంటను ఆశించిందని ఆయన తెలిపారు. సాధారణంగా వరి పిలకలు పెట్టే దశలో ఎడతెరిపి లేకుండా గాలులతో కూడిన వర్షాలు పడడం వల్ల, వరి నాట్లు దగ్గరగా వేసిన పొలాల్లోను మోతాదు మించి నత్రజని వాడిన పొలాల్లోను, మంచు ఎక్కువగా ఉండే వాతావరణంలోను, మొక్కల నీడ ప్రాంతాల్లోను ఈ తెగులు ఆశించి నష్టాన్ని కలుగచేస్తుందన్నారు. తుంగ, గరిక, ఊద వంటి గడ్డి జాతి మొక్కలపై ఈ బ్యాక్టీరియా జీవిస్తుందన్నారు. నత్రజని ఎరువులను సిఫార్సు మేరకు రెండు, మూడు దఫాలుగా వేసుకోవాలని, ఎంటీయూ 1318, స్వర్ణ వంటి రకాలకు ఎకరాకు 24 కిలోలు మాత్రమే వాడాలన్నారు. పొటాష్ ఎరువును ఎకరాకు 40 కిలోలు రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలోను, అంకురం ఏర్పడే దశలోను వేసుకోవాలన్నారు. పొలం గట్లపై గడ్డి జాతి మొక్కలు లేకుండా కలుపు నివారించుకోవాలన్నారు. పొలంలో నిలిచిన నీటిని మురుగునీటి కాల్వల ద్వారా బయటికి మళ్లించుకోవాలన్నారు. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్, మూడు గ్రాములు కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా రెండు గ్రాములు కాపర్ హైడ్రాక్సైడ్ పిచికారీ చేయడం వల్ల కొంతమేర తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. ఈ మందులు పిచికారీ చేసేటప్పుడు ఇతర పురుగు మందులు గానీ, తెగుళ్ల మందుల గానీ, పోషకాలు గానీ కలిపి పిచికారీ చేయరాదన్నారు. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందుబాటులో లేకపోతే పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 10 గ్రాముల వంతున కలిపి వరిపైరుపై పిచికారీ చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు అందించాల్సిందిగా వారిని ఆదేశించినట్టు జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తెలిపారు.

రేపు వికాసలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, అక్టోబరు 7: కలెక్టరేట్‌లోని వికాస జిల్లా కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైభవ్ జ్యూవెలర్స్‌లో సేల్స్ మేనేజర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, ఎలక్ట్రీషియన్, గోల్డ్ అప్రైజర్, మార్కెటింగ్ ఫీల్డు తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. జ్యూవెలరీ రంగంలో, రిటైల్ రంగంలో కనీస అనుభవం ఉండాలని, మరిన్ని వివరాలకు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్‌ను సంప్రదించాలని కోరారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

7లో



లక్ష్మీదేవి అలంకారంలో రాజరాజేశ్వరీ దేవి

కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కరెన్సీతో అలంకరించారు. **- పిఠాపురం**



భువనేశ్వరి పీఠంలో మహా చండీదేవిగా...

పట్టణంలోని భువనేశ్వరి పీఠంలో అమ్మవారు మహా చండీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. **- పెద్దాపురం**



బాలాత్రిపురసుందరిగా వాసవీ మాత

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట బస్టాండు వద్ద గల శ్రీవాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. **- అంబాజీపేట**



గోకవరంలో మహా చండీదేవిగా...

తూర్పు గోదావరి జిల్లా గోకవరం దేవీచౌక్ సెంటర్లో శ్రీకనకదుర్గ అమ్మవారు సోమవారం మహా చండీదేవిగా దర్శనచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. **- గోకవరం**



కల్యాణ గౌరీదేవిగా రత్నగిరి వనదుర్గ

రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ సోమవారం కల్యాణ గౌరీదేవిగా దర్శనమివ్వగా భక్తులు దర్శించి తరించారు. ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. **- అన్నవరం**

గాయత్రీదేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక

కాకినాడ శ్రీపీఠంలో ఐదో రోజుకు మహాశక్తి యాగం



సర్పవరం జంక్షన్, అక్టోబరు 7: వేలాది మంది మాతృమూర్తుల దుర్గాదేవి నామస్మరణతో మహాశక్తి యాగం ఆధ్యాత్మిక మణిహారమైంది. కాకినాడ రమణయ్యపేటలో శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో యాగం సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. అమ్మవారిని గాయత్రీదేవిగా విశేషాలంకరణ చేశారు. గాయత్రి, సౌర హోమాలు నిర్వహించిన అనంతరం గ్రహ దోష పరిహారం కోసం లక్ష నారికేళ పూజ ఘనంగా నిర్వహించారు. పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ లలితా సహస్ర నామాల్లో మనల్ని శక్తివంతులుగా మారేలా అమ్మవారి అనుగ్రహం ఉంటుందన్నారు. భారతీయ సంస్కృతిలో సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవం అన్నారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

శ్రీబాలాత్రిపురసుందరి దేవిగా దుర్గాదేవి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవీచౌక్‌కు పోటెత్తిన భక్తులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దుర్గాదేవి అమ్మవారు సోమవారం శ్రీబాలాత్రిపురసుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపి మంగళహారతులిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి భక్తుల తాకిడి పెరిగింది. మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపకాంతుల నడుమ దేవీచౌక్ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కుర్రకారు బూరాలు ఊదుతూ సందడి చేశారు. రాత్రి ప్రదర్శితమైన సత్యహరిశ్చంద్ర నాటకం పలువురిని ఆకట్టుకుంది.



విజయ డెయిరీ నుంచి వచ్చిన నెయ్యిని దిగుమతి చేస్తున్న అధికారులు, నాణ్యతను పరిశీలిస్తున్న ఈవో రామచంద్రమోహన్

సత్యదేవుని సన్నిధికి విజయ డెయిరీ నెయ్యి

అన్నవరం, అక్టోబరు 7: తిరుమల తిరుపతి దేవస్థానంలో నెయ్యి నాణ్యతపై ఆరోపణల నేపథ్యంలో అన్నవరం దేవస్థానం అధికారులు ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిపై జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో రివర్స్ టెండరింగ్ ద్వారా పలు కంపెనీల నుంచి టెండర్లు స్వీకరించి ఎల్-1 కాంట్రాక్టరుకు నెయ్యి సరఫరా చేసేందుకు అనుమతులిచ్చేవారు. అయితే పాత కాంట్రాక్టరు గడువు సెప్టెంబరు 30తో పూర్తయ్యింది. కొత్తగా పిలిచిన టెండర్లలో ఎల్-1గా తిరుపతికి చెందిన వినాయక ఏజెన్సీస్ టెండరు దక్కించుకుంది. అయితే తిరుమల వ్యవహారంతో అధికారులు ఆ కాంట్రాక్టును హోల్డ్‌లో పెట్టి ప్రభుత్వ ఉత్తర్వులు కోసం ఎదురుచూశారు. ప్రభుత్వ ఉత్తర్వులు రాకపోవడం, రత్నగిరిపై నెయ్యి నిల్వలు నిండుకుండడంతో విజయ డెయిరీ నుంచి తాత్కాలికంగా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. 7వేల కిలోలకు ఆర్డర్ పెట్టగా సోమవారం 4,500 కిలోల నెయ్యిని ఆ కంపెనీ సరఫరా చేసింది. మిగిలిన 2,500 కిలోలను ఒకట్రెండు రోజుల్లో అందిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. నెయ్యి నాణ్యత, వాసనను ఈవో రామచంద్రమోహన్ పరిశీలించారు.



ఏజెన్సీలో 'నది' షూటింగ్ సందడి

వరరామచంద్రాపురం, అక్టోబరు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం మండలంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఆదిత్యవర్మ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'నది' చిత్రంలోని పలు సన్నివేశాలను గిరిజన గ్రామమైన గుల్లేటివాడ పరిసర అటవీ ప్రాంతాల్లో చిత్రీకరిస్తు న్నారు. సీనియర్ నటుడు నాజర్, ముంబయి నటి నందితాదాస్ నటిస్తున్నారు. 15 రోజుల పాటు షూటింగ్ జరుగుతుందని సమాచారం.

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ▸ దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర టోర్నమెంటు ప్రారంభం

దివాన్‌చెరువు, అక్టోబరు 7: విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల పాఠశాల క్రీడా సమాఖ్య హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర టోర్నమెంటును సోమవారం ఆయన తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ క్రీడా మైదానంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సంపూర్ణ వ్యక్తిత్వవికాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ యువత క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే స్వామి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంటులో రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 350 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. తొలుత జాతీయ పతాకాన్ని మంత్రి దుర్గేష్, ఎస్‌జీఎఫ్ పతాకాన్ని ఎమ్మెల్యే బత్తుల, జిల్లా పతాకాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టరు సీహెచ్ విజయప్రకాష్, పరిశీలకుడు నాగేంద్ర, ఎంఈవో-2 జ్యోతిప్రసాద్, నాయకులు వంక మల్లిబాబు, దేశాల శ్రీను, వాసిరెడ్డి రాంబాబు, యర్రంశెట్టి శ్రీను, పలివెల బులిరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్. వేదికపై ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ. శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయప్రకాష్, డీఈవో వాసుదేవరావు



అనపర్తి తహసీల్దారు కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న స్వామినాయుడు

డమ్మీ పట్టాల తయారీపై విచారణ

అప్పటి డిప్యూటీ తహసీల్దారు శశిధర్, వీఆర్వోలను విచారించిన టూరిజం డిప్యూటీ డైరెక్టర్ స్వామినాయుడు

అనపర్తి, అక్టోబరు 7: అనపర్తి తహసీల్దారు కార్యాలయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 24న వెలుగు చూసిన డమ్మీ ఇంటి పట్టాల వ్యవహారంపై టూరిజం డిప్యూటీ డైరెక్టర్ స్వామి నాయుడు సోమవారం విచారణ చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థల సేకరణ, లబ్ధిదారుల ఎంపిక జరగకుండా తహసీల్దారు కార్యాలయ సిబ్బంది పట్టాలను పంపిణీకి సిద్ధం చేశారు. వాటిని గుర్తించిన టీడీపీ శ్రేణులు అప్పటి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో ఆందోళన నిర్వహించి డిప్యూటీ తహసీల్దారు శశిధర్‌ను పట్టాలతో సహా పట్టుకుని నిలదీశారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన టూరిజం డిప్యూటీ డైరెక్టర్ స్వామినాయుడు మాట్లాడుతూ అప్పటి డిప్యూటీ తహసీల్దారు శశిధర్‌తో పాటు కొంతమంది వీఆర్వోలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నామన్నారు. పలువురు టీడీపీ నాయకులు కూడా వివరాలు అందజేశారని, పూర్తి వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరలు అమ్ముతుండగా
వ్యాన్ ఢీకొని మహిళ మృతి



మృతురాలు రమణమ్మ (పాత చిత్రం)

కొత్తపల్లి, అక్టోబరు 7: సంత మార్కెట్లో మసాలా సామాన్లు విక్రయించేందుకు వస్తున్న వ్యాన్ అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన చందక రమణమ్మ (55) కూరగాయల వ్యాపారం చేస్తోంది. సోమవారం సంత కావడంతో సాయంత్రం నాలుగు గంటలకు కూరగాయలు అమ్ముతోంది. మసాల సామాన్లు విక్రయించేందుకు వస్తున్న వ్యాన్ అదుపు తప్పి రమణమ్మను బలంగా ఢీకొనడంతో దుర్మరణం చెందింది. కూరగాయలు కొనుగోలు చేస్తున్న రాయుడు అప్పారావుకు కాలు విరిగింది. సంఘటనా స్థలాన్ని కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌తో పాటు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రమణమ్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేష్ చెప్పారు.

టీచర్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా గోపిమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

ఏలూరు అర్బన్, అక్టోబరు 7: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో నిర్వహించనున్న ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా యూటీఎఫ్ పశ్చిమ గోదావరి జిల్లా నాయకుడు బి.గోపిమూర్తిని సంఘ రాష్ట్ర నాయకత్వం ఎంపిక చేసింది. ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో గోపిమూర్తి పరిచయ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు ఏపీ ఎన్జీవోల సంఘం, ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ, హెచ్ఎంల సంఘాల జిల్లా నాయకులను, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సూర్యారావు మాస్టారుని యూటీఎఫ్ నాయకులు కలుసుకుని ఎన్నికల్లో గోపిమూర్తికి మద్దతునివ్వాల్సిందిగా అభ్యర్థించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి మాట్లాడుతూ 1998లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన నాటి నుంచి ఉపాధ్యాయ, ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నానన్నారు. అప్రంటీస్ వ్యవస్థ రద్దు, సీపీఎస్ రద్దు పోరాటాలు ముఖ్యమైనవన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రథమ ప్రాధాన్యతా ఓటును తనకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తొలుత దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి, సంఘ రాష్ట్ర మాజీ నాయకుడు ఎస్ఆర్ పోలిశెట్టి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపిమూర్తికి ఎన్జీవోల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ శ్రీనివాస్, రామారావు, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీ రమణ, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్ మద్దతు తెలిపారు.

సొసైటీలో దొంగతనానికి
పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, అక్టోబరు 7: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు సొసైటీలో నగదు, మోడెమ్ చోరీ చేసిన నిందితుడిని పట్టణ పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దగొన్నూరు గ్రామానికి చెందిన గుబ్బిలి సుబ్రహ్మణ్యాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.5వేలు రికవరీ చేసి రిమాండ్ నిమిత్తం కొవ్వూరు కోర్టులో హాజరుపరిచినట్టు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.



పెద్దాపురం మండలం తాటిపర్తిలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

పిఠాపురం, పెద్దాపురంలో విజిలెన్స్ తనిఖీలు

33.30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం, అక్టోబరు 7: రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ ఎం.స్నేహిత ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో సోమవారం దాడులు నిర్వహించారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద ఐషర్ వ్యాన్‌లో తరలిస్తున్న 13.2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రూ9.62 లక్షలు విలువైన బియ్యం, వ్యాన్‌ను సీజ్ చేశారు. బియ్యం రవాణా చేస్తున్న గొల్లప్రోలు పట్టణానికి చెందిన వెలుగుల వాసు, వేన్ డ్రైవర్ వెలుగుల గుర్రయ్యపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పిఠాపురం పట్టణ పోలీసులకు సూచించారు.

పెద్దాపురం: మండలంలోని తాటిపర్తి గ్రామంలో తుమ్మలపల్లి నాగబాబు తన ఇంట్లో 41 బ్యాగుల్లో 2010 కేజీల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. పక్కా సమాచారం అందడంతో పోలీసులు సోదా చేసి గుర్తించారు. పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ.17కి కొని సమీపంలో ఉన్న ఇటుక బట్టీ కార్మికులకు రూ.21కు విక్రయిస్తున్నాడు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం విలువ సుమారు రూ.1,00,460. రేషన్ బియ్యాన్ని, తూకపు యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం క్రయ, విక్రయాలు జరుపుతున్న తుమ్మలపల్లి నాగబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పెద్దాపురం పోలీసులకు సూచించారు. ఈ రెండుచోట్లా సెక్షన్ 6 (ఎ) కింద కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్‌కుమార్, వలీ, జీవానందం, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తుల సవరణకు అవకాశం

పెద్దాపురం, అక్టోబరు 7: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారు ఈ నెల 8, 9 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా సవరించుకోవచ్చని ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



బీచ్ ఫ్రంట్‌ని సందర్శిస్తున్న బాలాజీ

కాకినాడ బీచ్ అభివృద్ధికి కృషి

ఏపీ టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 7: కాకినాడ బీచ్‌ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్ ఫ్రంట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ దర్శన్, ప్రసాద్ వంటి పథకాల ద్వారా పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి నూతన పర్యాటక విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. బీచ్ ఫ్రంట్‌లో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాల పూర్తికి, పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి పసుపులేటి పోశయ్య, ఏఈ వెంకటేష్, ఏపీవో త్రిమూర్తులు పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ ఉద్యోగి గుండెపోటుతో మృతి

దేవరపల్లి, అక్టోబరు 7: తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన నాగిరెడ్డి గంగయ్య ప్రభు (48) మండలంలోని యర్నగూడెం 3ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం ఉదయం ఎ-షిఫ్ట్‌లో పని చేస్తుండగా ఛాతీలో నొప్పి వస్తోందని సహచర ఉద్యోగులకు తెలిపాడు. దీంతో తూర్పుగోపు నవీన్‌బాబు ప్రభుని ఫ్యాక్టరీ వాహనంలో దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.

విద్యుత్ షాక్‌తో
సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ దుర్మరణం



తిరునావ్ అరసు (పాత చిత్రం)

మోతుగూడెం, అక్టోబరు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ తిరునావ్ అరసు (55) విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందాడు. పోలీస్ స్టేషన్ వద్ద భద్రత విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ పోలీసులు ఆదివారం రాత్రి డొంకరాయి నుంచి మెట్టగూడెం గ్రామ శివార్లలో గల అటవీ ప్రాంతానికి వెళ్తుండగా తిరునావ్‌కు విద్యుత్ షాక్ తగిలింది. అడవి జంతువుల వేట కోసం అమర్చిన విద్యుత్ వైరు తగిలి ఆయన చనిపోయినట్టు కూంబింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది గుర్తించారు. తిరునావ్‌ను వెంటనే డొంకరాయి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం చేసి చింతూరు ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్తుంగా మార్గమధ్యంలో చనిపోయాడు. తిరునావ్ తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా వీరకుట్టిపాల్యం ప్రాంతానికి చెందినవాడు.

సంచార ప్రదేశాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే
కఠిన చర్యలు: ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



మోతుగూడెం, అక్టోబరు 7: సంచార ప్రదేశాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు. వ్యవసాయ, అటవీ భూముల్లో సంచార ప్రదేశాల్లో అక్రమంగా, అనధికారికంగా విద్యుత్ తీగలు అమర్చి జంతువులకు, మానవులకు హాని కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'టీడీపీ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావిస్తా'

అంబాజీపేట, అక్టోబరు 7: టీడీపీ కార్యకర్తలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని, తాను ఎప్పుడు ఎవర్ని ఉద్దేశ పూర్వకంగా విమర్శించలేదని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నామన రాంబాబు అన్నారు. ఇటీవల పి.గన్నవరంలో జరిగిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నేతలు, మండలాధ్యక్షుల సమావేశంలో అంబాజీపేట మండల కార్యదర్శి గుడాల ఫణి తన పేరును ప్రస్తావించలేదని, తనను ప్రశ్నించడం బాధించి ఆవేశంగా మాట్లాడానని నామాన పేర్కొన్నారు. 42ఏళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నన్నారు.

● అల్లవరం, కొత్తపేటలో ఎమ్మెల్యేలు బండారు, ఆనందరావు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ ● ప్రజల నుంచి సమస్యలపై వినతుల స్వీకరణ, పరిష్కారానికి ఆదేశాలు

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తా




కొత్తపేట: ప్రజాదర్బార్‌లో సమస్య వింటున్న ఎమ్మెల్యే బండారు, అల్లవరం: ఎమ్మెల్యే ముందు విలపిస్తున్న రామేశ్వరం మత్స్యకారమహిళలు

కొత్త పేట, అక్టోబరు7: ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట పంచాయతీ ప్రాంగణంలో సోమవారం ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అర్జీదారులు పోటెత్తారు. పలు సమస్యలకు పరిష్కారం కోరుతూ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి అర్జీదారుడి నుంచి వచ్చిన వినతులను సత్యానందరావు స్వయంగా విని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రావులపాలెం రూరల్ సీఐ కార్యాలయాన్ని కొత్తపేటలో ఏర్పాటు చేయాలని కోనసీమ అభివృద్ధి సాధన సమితి సభ్యులు సత్తిరాజు ఆదిత్యకిరణ్, గుబ్బల మూర్తి తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై బండారు మాట్లాడుతూ దీనిని కొత్తపేటలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రజాదర్బార్‌లో 403 దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, ముత్యాల బాబ్జి, యల్లమల్లి జగన్మోహన్, రెడ్డి రామకృష్ణ, బీర ఇసాక్, రెడ్డి చంటి, తాతాజీ పాల్గొన్నారు.

ఆక్వా చెరువులు తొలగిస్తే ముంపునకు పరిష్కారం
ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అల్లవరం, అక్టోబరు 7: సముద్ర తీరం వెంబడి మత్స్యకారులు వేటాడే పర్రభూముల్లో ఆక్రమిత ఆక్వా చెరువులను తొలగిస్తేనే రైతులకు ముంపు నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. స్థానికమండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రసంగించారు. ఆక్రమణల తొలగింపునకు నిష్పక్షపాతంగా రైతులు సిద్ధం కావాలన్నారు. ఎస్.రామేశ్వరంలో సరిహద్దు వివాదాలు సృష్టిస్తూ పంతాడి సత్యనారాయణ పేదల ఇళ్లు నిర్మించుకోకుండా ఆటంకాలు కలిగిస్తున్నాడని అంగాడి లక్ష్మి, పలువురు మత్స్యకార మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసి బోరున విలపించారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఐ హరీష్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజీ, 12మేజర్ రెవెన్యూ సమస్యలతోపాటు 42 ఫిర్యాదులు వచ్చాయని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ తెలిపారు. రామేశ్వరం మొగకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు కోరారు. గోడిగురుకుల పాఠశాలలో మురుగుదొడ్ల పైపులైన్ సొంత నిధులతో చేయించానని టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు తెలిపారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, దెందుకూరి సత్తిబాబురాజు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహసీల్దారు వీవీ నరసింహరావు, బొర్రా ఈశ్వ రరావు, కంకిపాటి వీరబాబు, సుంకర సాయిబాబు, మంతెన సురేష్ రాజు, వేగిరాజు వెంకట్రాజు, పోలిశెట్టి బాబు పాల్గొన్నారు.

స్వల్పకాలంలో నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తా



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, అక్టోబరు 7: రాజోలు నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలు జనవరి నాటికి దాదాపుగా పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువెళ్లానని, త్వరలో అవన్నీ పరిష్కారమవుతాయన్నారు. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య లేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టా భూముల్లో ఇసుకను గృహనిర్మాణాలకు తరలించడానికి ప్రభుత్వం అనుమతిస్తూ జీవో ఇచ్చిందన్నారు. గోదావరి ఇసుక ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు సిద్ధం చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.11.20కోట్లతో వివిధ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. రూ.77కోట్లతో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి, సడక్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సర్పంచ్‌లు యెనుముల నాగు, సీహెచ్ హెలీన, రాపాక ఆనందరావు, గెడ్డం రాజ్యలక్ష్మి తదితరులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీడీవో మంగాదేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుందరశ్రీనివాస్, తహసీల్దార్ సీఎస్ రాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

పి.గన్నవరం, అక్టోబరు7: ప్రతి నిరుపేదకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించి అనంతరం మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆగిపోయిన సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, ఈవిషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసువెళతానన్నారు. మానేపల్లిలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిఖిల్‌కు బసవతారకం ఆసుపత్రిలో ముందస్తు వైద్యం కోసం రూ.8లక్షలు మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందించామన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 11మందికి రూ.4.23లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. కార్యక్రమంలో దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దాల సుబ్బారావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెం కటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, చిట్టూరి శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, శేరు శ్రీనుబాబు, ఆది మూలం సూర్యనా రాయణ, యల్లమిల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

జిల్లాలో 133 మద్యం దుకాణాల ఏర్పాటు



రాజోలులో మాట్లాడుతున్న జిల్లా సూపరింటెండెంట్ ప్రసాద్

రాజోలు/కొత్తపేట, అక్టోబరు 7: జిల్లాలో ఆరు ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయని, రాజోలు, రామచంద్రపురం, అమలాపురం, కొత్తపేట, ఆలమూరు, ముమ్మిడివరం స్టేషన్లకు సంబంధించి గతంలో ప్రభుత్వం 150మద్యం షాపులు నిర్వహించగా వాటిని కుదించి 133షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. రాజోలు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఆరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధి నుంచి 300దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తులను అక్టోబరు 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు స్వీకరిస్తామన్నారు. ఈనెల11వ తేదీ ఉదయం 8గంటల నుంచి అధికారులు, లబ్ధిదారుల సమక్షంలో వీడియోగ్రఫీ ద్వారా కలెక్టర్ నిర్వహణలో పారదర్శకంగా డ్రా తీస్తామని తెలిపారు. డ్రా తగిలిన మొదటి లబ్ధిదారుని ఎంపిక అందరి సమక్షంలో జరుగుతుందన్నారు. వ్యాపారం లేకపోవడంతో, ఆక్వా పరిశ్రమ దెబ్బతినడంతో ఆక్వారైతులు మద్యం షాపుల వైపు మక్కువ చూపిస్తున్నారన్నారు. సమావేశంలో రాజోలు ఎక్సైజ్ సీఐ కె.వీరబాబు,సిబ్బంది పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన మద్యం పాలసీ విధానంగతం కంటే ఎంతో సులభతరం చేసిందని ఎక్సైజ్ సూపరిండెంట్ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం కొత్తపేట ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలాన్ని ఒక యూనిట్‌గా మున్సిపాల్టీని ఒక యూనిట్‌గా తీసుకున్నామన్నారు.సీఐ కె.కాత్యాయని, ఎస్ఐ కె.అన్నవరం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మామిడికుదురు, అక్టోబరు 7: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు సమష్టిగా కృషి చేయాలని సర్పంచ్‌ల సమాఖ్య సమావేశం తీర్మానించింది. మండల సర్పంచ్‌ల సమావేశం నగరం పంచాయతీ వద్ద సోమవారం జరిగింది. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో చేసే పనులకు సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వాలని కోరారు. విద్యుత్ సరఫరాలో ఏర్పాటుచేసే డిజిటల్ మీటర్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించేందుకు మళ్లీ సమావేశం కావాలని కోరారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్రీశైలానికి బండారు అభిమాని పాదయాత్ర

ఆలమూరు, అక్టోబరు 7: కూటమి అధికారంలోకి రావాలని, కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు గెలిస్తే శ్రీశైలం వస్తానని జొన్నాడకు చెందిన బావన శ్రీనివాస్ మొక్కుకున్నారు. సోమవారం జొన్నాడ నుంచి శ్రీశైలం బయలుదేరిన శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, రామనుజుల శేషగిరిరావు, కొత్తపల్లి కృష్ణ, కె.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ ఆటవిక దాడులు ఆపాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 7: గాజాపై ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న ఆటవిక దాడులు ఆపి కాల్పుల విరమణ ప్రకటించాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు కోరారు. ఇజ్రాయిల్ తక్షణం యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. గాజాపై జరుగుతున్న ఆటవిక దాడులపై ఈనెల 11న అమలాపురంలో సంఘీభావ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గూడాల రమణ పాల్గొన్నారు.

నూతన విగ్రహ ప్రతిష్ఠ

కాట్రేనికోన, అక్టోబరు7: చింతలమెరకలో సోమవారం విజయదుర్గ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సుదర్శనం వెంకటజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భారీ అన్నసమారాధన నిర్వహించారు. కముజు లక్ష్మీరమణారావు, వనచర్ల సత్యనారాయణమూర్తి, సంసానిఅర్జున, సంసాని దుర్గాప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలోపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, గెద్దనపల్లి సర్పంచ్ దంతులూరి కృష్ణ పాల్గొన్నారు.

మండల పరిషత్ ఏవోగా నాగరాజు

రాయవరం, అక్టోబరు 7: స్థానిక మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా యమజాల నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏవో శ్రీనివాసరావు గోకవరం మండలానికి బదిలీ అయ్యారు.

క్రికెట్ జట్టుకు అంబాజీపేట విద్యార్థి

అంబాజీపేట, అక్టోబరు7:ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా అండర్-14 క్రికెట్ జట్టుకు అంబాజీపేట హైస్కూల్ విద్యార్థి సీహెచ్‌లక్ష్మీనారాయణ ఎంపికైనట్లు హెచ్ఎం కె.సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. కడపలో సోమవారంనుంచి జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, ఒంగోలు, కృష్ణ, అనంతపురం జిల్లా జట్లతో తూర్పుగోదావరి జిల్లా జట్టు పోటీ పడుతుందన్నారు. ఎంఈవోలు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీడీవోగా పద్మజ్యోతి



ద్రాక్షారామ, అక్టోబరు 7: రామచంద్రపురం ఎంపీడీవోగా కె.పద్మజ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గోకవరం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఎంపీడీవోగా రత్నకుమారి



కపిలేశ్వరపురం, అక్టోబరు 7: కపిలేశ్వరపురం ఎంపీడీవోగా కె.రత్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడియం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కొండలరావు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరానికి బదిలీపై వెళ్లారు.

మైసూర్ యాత్రకు ఆర్టీసీ బస్సు

రావులపాలెం, అక్టోబరు7: రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి మైసూర్ యాత్రకు రెండు ఆర్టీసీ బస్సులు బయలుదేరినట్లు డిపోమేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, గోకర్ణం, మురదేశ్వర్, కొల్లూరి మూకాంబిక, ఉడిపి, శృంగేరి, హొర్నాడు,ధర్మస్థల, కుక్కేసుబ్రహ్మణ్యం, హలేబేడు, బేలూరు, శ్రీరంగపట్నం, కోటిలింగాలు, మైసూరు, అరుణాచలం, శ్రీకాళహస్తి దర్శనాలు తర్వాత 15న రావులపాలెం చేరుకుంటుందన్నారు.

కాలినడకన బయలుదేరిన భవానీ భక్తులు

కపిలేశ్వరపురం, అక్టోబరు 7: కపిలేశ్వరపురంలో భవానీ మాలధారులు సోమవారం దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు కాలినడకన విజయవాడ బయలుదేరారు. విచిత్ర వేషధారణలతో గ్రామంలో ఊరేగుతూ జైజై మాత, జైజై దుర్గ అంటూ అమ్మవార్కి పూజలు నిర్వహించారు. విజయదశమి రోజున అమ్మవారిని దర్శించుకోనున్నట్లు గురు భవానీ పాముల వీరబాబు తెలిపారు.

యానాం సమస్యలపై గవర్నర్, సీఎస్‌లకు వినతి



గవర్నర్ కైలాష్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లాడి

యానాం, అక్టోబరు 7: యానాంలో ఉన్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథ్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వినతిపత్రం అందజేశారు. పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో సోమవారం మల్లాడి గవర్నర్‌తో భేటీ అయ్యారు. యానానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి వినతిప్రతం అందజేశారు. పలు సమస్యలను ఇప్పటికే పరిష్కరించారని, మిగిలిన పెండింగ్ పనులను యానాం పర్యటనకు వచ్చేలోపు పరిష్కారించాలని మల్లాడి కోరారు. నవంబరు మొదటివారంలోపు గవర్నర్ యానాం పర్యటనకు రానున్నారని మల్లాడి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశమైన మల్లాడి యానాం అంశాలపై చర్చించారు. సాయ్ స్పోర్ట్ కళాశాలకు, జీఎస్ఎం కళాశాలకు ఇటీవల స్థలం కేటాయిస్తూ జీవో విడుదల చేయడంపై సీఎస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో పనిచేస్తోన్న సిబ్బందిని యానానికి బదిలీచేసే అంశాలపై చర్చించారు. జూన్ 21న జరిగిన సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించాలని మల్లాడి కోరారు.

డ్యాన్స్‌మ్యూజిక్ అకాడమీ నృత్య ప్రదర్శనలు

అంతర్వేది, అక్టోబరు 7: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన శ్రీసాయిశివ డ్యాన్స్‌మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో చేసిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. నారసింహ క్షేత్ర మహత్యం తదితర నృత్యాలను చేసిన కళాకారులకు ఆలయ సిబ్బంది ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేసి అభినందించారు.

రూ.40లక్షలతో డ్రెయిన్ నిర్మాణం

అమలాపురం టౌన్, అక్టోబరు 7: ఈదరపల్లిలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. అమలాపురం పట్టణానికి ఆనుకుని ఉన్న ఈదరపల్లిలో డ్రైనేజీ సమస్య పరిష్కారంలో భాగంగా రూ.40లక్షలతో చేపట్టనున్న డ్రెయిన్ నిర్మాణ పనులకు సోమవారం ఆనందరావు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, సర్పంచ్ రాయుడు వరలక్ష్మి, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఏజెంట్లకు నష్టం కలిగించే చర్యలపై ధర్నా

అమలాపురంటౌన్, అక్టోబరు7: ఎల్ఐసీఏజెంట్లకు నష్టం కలిగింపే విధంగా యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలను నిరసిస్తూ అమలాపురం ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఇఫ్ ఇండియా పిలుపు మేరకు సుందరనీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏజెంట్లకు న్యాయం జరిగేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. బ్రాంచి కార్యదర్శి ఎం.శ్యామ్‌బాబు, రావూరి ఉదయభాస్కర్, దొమ్మేటి శివస్వామి, పెసంగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూముల సమగ్ర సమాచారం అందించాలి

అమలాపురం అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూముల తో పాటు రిజిస్ట్రేషన్ వివరాలను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కోరుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారం జిల్లా కేంద్రానికి అందించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 20ఏళ్ల పైబడిన అసైన్డ్ భూములకు ఉచిత హక్కుల కల్పనపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని, రిజిస్ట్రేషన్ నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. తొలుత సోమవారం అమరావతి నుంచి రాష్ట్ర భూపరిపాలన ముఖ్యకమిషనర్ జి.జయలక్ష్మి, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి జేసీ పాల్గొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చినబాబుపాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ఉండాలి

ఆలమూరు, అక్టోబరు7: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో జొన్నాడ సెంటర్ వద్ద సోమవారం వాహన డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. టీడీపీ నాయకులు తాడి శ్రీనివాస్‌రెడ్డి , గొడవర్తి దుర్గాప్రసాద్(బాబి) పాల్గొన్నారు

శాంతి ర్యాలీ

మలికిపురం, అక్టోబరు 7: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ దేశం చేస్తున్న యుద్ధం వల్ల 42వేల మందికి పైగా ప్రజలు చనిపోయారని, ఈయుద్ధం కొనసాగితే అపార ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. యుద్ధాన్ని ఆపి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మలికిపురంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. యుద్ధం వద్దు ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, యుద్ధోన్మాదం నశించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. దేవ రాజేంద్రప్రసాద్, చెల్లుబోయిన తాతారావు, దొండపాటి భానోజీ, నల్లి బుజ్జిబాబు,పిచ్చిక గంగాధర్, మేడిచర్లసత్యనారాయణ పాల్గొన్నారరు.

దుర్గాప్రసాద్ హత్యపై నిష్పాక్షిక దర్యాప్తు చేయాలి
కలెక్టరేట్ ఎదుట దళితుల నిరసన

అమలాపురం టౌన్, అక్టోబరు 7: వలంటీరుగా పనిచేసిన జనుపల్లి దుర్గాప్రసాద్ హత్యపై నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించి నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ కలెక్టరేట్ ఎదుట దళిత సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. మృతుడు దుర్గాప్రసాద్ భార్య శ్రావణ సంధ్య, కుమారులు సాత్విక్, శాశ్వత్‌తో పాటు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుగా నమోదుచేసి త్వరితగతిన విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం వీసీకే పార్టీ జిల్లాశాఖ అధ్యక్షుడు బొంతు రమణ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కేసు బాధ్యతను కొత్తపేట డీఎస్పీ గోవిందరావుకు అప్పగించగా ఇప్పటికే ప్రత్యేక బృందాలను నియమించామని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని కుటుంబ సభ్యులకు జేసీ తెలిపారు. మాలమహానాడు, వివిధ సంఘాల నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, కారెం వెంకటేశ్వరరావు, యడ్ల పండు, గెల్లా రాజేంద్ర, మాగాపు ఈశ్వరరావు, మెండి డేవిడ్ అంబేడ్కర్, సాపే రమేష్, నేల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No.41/2020 OS No.3/2017

Between

శిరిగినీడి రవి -DHr

And

సుంకర త్రిమూర్తులు, S/o.పాపయ్య, కాంట్రాక్టరు, 65 సం॥లు, డోర్ నెం.32-10-1/2, లలితానగర్, రామచంద్రపురం టౌన్ & మండలం, డా॥బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా -JDr

పై నెంబరు E.P. ప్రకారం డి.హెచ్.ఆర్/వాదికి రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ సుదహరించిన E.P. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.25-10-2024 తేదీన ఉదయం గం॥10.30 ని॥ల నుండి పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు వేలం వేయబడును. సదరు వేలంలో పాల్గొనదలచినవారు డి.హెచ్.ఆర్. మగానీ, డి.హెచ్.ఆర్/వాది అడ్వకేటు గారిని కానీ కలిసి సమాచారం పొందవచ్చును.

షెడ్యూలు: తూర్పు గోదావరి జిల్లా ప్రస్తుతం డా॥బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు పరిధిలో చేరిన రామచంద్రపురం మున్సిపల్ ఏరియా, ముచ్చుమిల్లి గ్రామం తాలూకు లలితానగర్ 3వ బ్లాకులోని లే-అవుట్ ప్లాన్ నెం.557/1983 రులో నెం.43రు ప్లాటు దాఖలా చ.గ.266 2/3 లు, యస్.ఆర్.నెం.99,101 నివేశన స్థలమున్నూ అందలి డోరు నెం.32-10-1/3 రు గల ఆర్.సి.సి.డాబా ఇల్లు వగైరాలకు కొలతలు, హద్దులు:- తూర్పు: గ॥ 22.00 ప్లాటు నెం.44 రు స్థలం, ఇల్లు పడమర: గ॥ 22.00 ద్విభాష్యం నాగేశ్వరరావు గారి ప్లాటు నెం.42 రు స్థలం, ఇల్లు ఉత్తరం: గ॥ 13.1 ప్లాటు నెం.33 రు స్థలం, ఇల్లు దక్షిణం: గ॥ 13.1 లేఅవుట్ రోడ్

సదరు హద్దుల మధ్యస్థమైన చ॥గ॥ 266 2/3 లు చ॥మీ॥ 222.97 లు నివేశన స్థలం అందలి చ॥అ॥ 600 లు వైశాల్యంలో గల ఆర్.సి.సి. డాబా ఇల్లు, తలుపులు, ద్వారబంధములు, పై స్లాబు అందలి మామూలు నీటి మార్గములు, రివాజు దారి మార్గములు, యావత్తు యాజమాన్యపు హక్కులు సర్వం సహా

DHR విలువ : 9,00,000/-

అమీనా విలువ : 30,00,000/-

శ్రీ అల్లూరి గణిరాజు
అడ్వకేటు
రామచంద్రపురం

రామచంద్రపురం
తేది:5-10-2024

అక్విడెక్టు పరిశుభ్రతకు చర్యలు

పి.గన్నవరం, అక్టోబరు 7: పి.గన్న వరం అక్విడెక్టు పరి సరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ డీఈ ఆర్.నాగేంద్రకుమార్ తెలి పారు. కొత్త అక్విడెక్టు వద్ద సిబ్బంది చేస్తున్న పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. అక్విడెక్టుకు నిర్వహణకు నిధులు మంజూరు కాలేదన్నారు. జేఈ సుందర్‌సింగ్, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు చొల్లంగి సత్తిబాబు పాల్గొన్నారు.

జీవిత బీమా ఏజెంట్ల నిరసన

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 7: రామచంద్రపురం జీవిత బీమా కార్యాలయం వద్ద సోమవారం ఏంజెట్లకు పాలసీ కమీషన్ రేట్లు తగ్గింపును నిరసిస్తూ ఏజెంట్లు నిరసన చేపట్టారు. లియాఫీ మెంబరు ఎస్‌కేఎంఎంకే మస్తాన్, రౌతు లక్ష్మీగణేష్, ఏజెంట్లు పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్‌గా ఆనందసాగర్ బాధ్యతల స్వీకరణ



పి.గన్నవరం, అక్టోబరు7: పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర డైరెక్టర్‌గా టీడీపీ అధికార ప్రతి నిధి, నియోజకవర్గ కోకన్వీనర్ మోకా ఆనందసాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సంస్థ కార్యాల యంలోని చైర్మన్ తోట సుధీర్, అధికారుల సమక్షంలో ప్రమాణ పత్రంపై సంతకం చేశారు. సీఎం, కూటమి ప్రభుత్వం, మంత్రులు తనపై నమ్మకంతో డైరెక్టర్ పదవి ఇచ్చారని, వారినమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.

ఆలమూరు డీటీగా సుబ్బరాజు



ఆలమూరు, అక్టోబరు 7: ఆలమూరు డిప్యూటీ తహశీల్దార్‌గా తేతలి సుబ్బరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మండపేట సివిల్ సప్లయ్ అధికారిగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండల సర్వేయర్‌గా ప్రభావతి నియమితులయ్యారు. ఆమె ఆత్రేయపురం మండల సర్వేయర్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మలికిపురం, అక్టోబరు 7: పెదతిప్పలో శ్రీఅభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, దేశినీడి తాతాజీ, తిరుమల ఏసుబాబు, తిరుమల గవర్రాజు, మల్లిపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

కాలినడకన విజయవాడ దుర్గమ్మ గుడికి

కపిలేశ్వరపురం, అక్టోబరు7: వాకతిప్పకు చెందిన అల్లూరి రామకృష్ణచౌదరి, కపిలేశ్వరపురానికి చెందిన పువ్వల వీరవెంకట సత్యప్రసాద్(చిట్టిబాబు) విజయవాడ శ్రీకనకదుర్గమ్మ దర్శనానికి కాలిన డకన బయలు దేరారు. మండపేట వేగుళ్ల వీర్రాజు సెం టర్‌లో కనకదుర్గమ్మగుడిలో రామకృష్ణచౌదరి, చిట్టిబాబులతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఈయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేగా వేగుళ్ల విజయం సాధించడంతో మొక్కు తీర్చుకోవడానికి కనకదుర్గమ్మ దర్శనానికి విజయవాడ కాలినడకన వెళ్తున్నట్లు చౌదరి తెలిపారు.

సీపీఎంను బలోపేతం చేయాలి

ముమ్మిడివరం, అక్టోబరు 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పాము బాలయ్య పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా దొమ్మేటి వీరరాఘవులు అధ్యక్షతన సోమవారం జరిగిన మహాసభలో కారెం శివాజీ, సీపీఎం జిల్లాకమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా మాట్లాడారు. నూతన శాఖ కార్యదర్శి సకిలే సూర్యనారాయణను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సమావేశంలో కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. సీపీఎం పార్టీ ఆలిండియా కార్యదర్శి సీతారంమ ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సకిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణ్, ఇసుకపట్ల మంగాదేవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లాను యూనిట్‌గా నిర్ణయించడంపై హర్షం



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

కె.గంగవరం, అక్టోబరు7: ప్రభుత్వం ఈఖరీఫ్ సీజన్ నుంచి సీఎంఆర్ విధానంలో ధాన్యం కొనుగోలుకు జిల్లా యూనిట్‌గా తీసుకున్న నిర్ణయంపై కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. అసోసి యేషన్ నాయకులు సోమవారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తోట సుధీర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, స్టేట్ జాయింట్ సెక్రటరీ వైట్ల కనకదు ర్గారావు, తాలూకా అధ్య క్షుడు చంటిబాబు, గుణ్ణం చరణ్, వల్లి శ్రీమన్నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

